క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

హిరమండలం: వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వరరావు కోరారు. తడిచిన చేతులతో విద్యుత్ స్తంభాలు, మోటరు స్టార్లను, విద్యుత్ లైన్లను తాకుతున్న చెట్లును ముట్టవద్దన్నారు. అలాంటి చెట్లు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. గాలి వల్ల తెగిన వైర్లను సైతం ఎట్టి పరిస్థితిల్లో తాకరాదన్నారు. విద్యుత్ తీగలకు సమీపంలో దుస్తులు ఆరవేయరాదన్నారు. చిన్నారులు ఎలక్ట్రిక్ వస్తువుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు.

సత్యసాయి సేవా సంస్థకు శంకర్ ఫౌండేషన్ అవార్డు



అవార్డు అందజేస్తున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో కంటి రోగులకు అందించిన సేవలకు విశాఖ శంకర్ ఫౌండేష్ సంస్థ అవార్డును ప్రదానం చేసింది. సంస్థ వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు జయంతిని విశాఖలో సోమవారం శంకర్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. అవార్డును పొందూరు సత్యసాయి సేవా సంస్థ కన్వీనర్ దున్న రాధాకృష్ణ, సీనియర్ సభ్యులు పెన్నం నానాజీలకు అందజేశారు. జిల్లాలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేటరాక్ట్ ఆపరేషన్లకు పొందూరు నుంచి ఎక్కువ రోగులను పంపించినందుకు ఈ అవార్డును అందించారు.

ఆనందరావుకు సన్మానం



ఆనందరావును సన్మానిస్తున్న శంకర్ ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన విజయాంబికా యువజన సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావుకు శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నంలో సన్మానించారు. కొన్నేళ్లుగా యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఎంతో మందికి ఆనందరావు శస్త్రచికిత్సలు చేయించారు. శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ కృష్ణ కిశోర్, జనరల్ మేనేజర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో అవస్థలు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కొత్తూరు: మండలంలోని కురిగాంలో కాలువల ద్వారా మురుగునీరు బయటకు వెళ్లకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. మురుగునీరు బయటకు వెళ్లకుండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అడ్డుకోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. మురుగునీటి సమస్యపై ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ సేపాన అశోక్ కుమార్ తెలిపారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నరసన్నపేట: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నరసన్నపేటశాఖ పరిధిలోని ఆరు మండలాల పాలసీదారులకు సంతృప్తికరంగా సేవలు అందిస్తున్నామని బ్రాంచ్ మేనేజర్ ఎం.నేతాజీ అన్నారు. ఎల్ఐసీ 68వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఇన్సూరెన్స్ పాలసీలు, అందిస్తున్న సేవలు వివరించారు. నరసన్నపేట, పోలాకి డీటీలు పి.శ్రీనివాసరావు, శరత్, ఎల్ఐసీ డవలప్‌మెంట్ ఆఫీసర్లు పార్థసారథి, బాలగంగాధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.ప్రమీల, యూనియన్ ప్రతినిధి ఆర్.సురేష్‌బాబు, ఏజెంట్ సంఘం ప్రతినిధులు ఉప్పాడ పూర్ణారావు, ఇప్పిలి నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

మెళియాపుట్టి: పట్టుపురం గ్రామ శివారులోని శేఖరాపురం గ్రామ బస్టాండ్ ఆవరణలో తొమ్మిది మంది జూదరులను మెళియాపుట్టి పోలీసులు సామవారం పట్టుకున్నారు. జూదం ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేశామని పోలీసులు తెలిపారు. వారివద్ద నుంచి రూ.9710 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పేదల పెన్నిధి వైఎస్సార్



పాతపట్నం: ఆస్పత్రి కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు



కొత్తూరు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు



సారవకోట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: ఈదులవలసలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, నాయకులు



మెళియాపుట్టి: పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పొందూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జలుమూరు: కొమనాపల్లి వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు

పేదల పెన్నిధి, మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని వాడవాడలా సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్ పాలనను గుర్తు చేసుకున్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ ముందజలో నిలిచిందన్నారు. మహానేత రూపకల్పన చేసిన 108, 104, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు అన్ని వర్గాల వారికి అండగా నిలిచాయన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయండి



ఎంపీడీఓకు పిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ వడ్డినవలస గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన మంచినీటి పథకం ద్వారా మూడు ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ గ్రామానికి చెందిన బడ్డి లక్ష్మణ, బడ్డి సోమేశ్వరరావు, ఇప్పిలి సూర్యనారాయణ ఇళ్లకు కావాలనే కుళాయిలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. బుడితి జగనన్న కాలనీలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్ విన్నవించారు. అలుదు పంచాయతీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న కొన్ని సంఘటనలపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, బాబూరావు, శంకరరావు, దండాశి, షణ్ముఖరావు, పార్టీ నాయకులు పోలాకి కేశవరావు, గెల్లంకి వెంకటరావు, బోర శ్రీరామ్మూర్తి, నిక్కు కృష్ణారావు, రావాడ శ్రీనివాసరావు, కల్యాణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నరసన్నపేట: రోజువారీ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రస్తుత ధరలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం నరసన్నపేటలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సామాన్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రుచికరమైన ఆహారం తినలేక పోతున్నారన్నారు. పెరిగిన ధరలపై పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరలు తగ్గించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్లో తగిన నిధులు కేటాయించాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టం అమలు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు. సీపీఐ ప్రతినిధులు సింహాద్రి భాస్కరరావు, చిన్నిబాబు, రాము, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో సత్తా



కర్రసాములో సత్తా చాటిన విద్యార్థులతో స్థానికులు

నరసన్నపేట: కర్రసాము రాష్ట్ర స్థాయి పోటీల్లో నరసన్నపేటకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. కర్రసాము (సిలింబం) రాష్ట్రస్థాయి 2024–25 చాంపియన్‌షిప్ పోటీలు శ్రీకాకుళంలోని అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో శని, ఆదివారాల్లో నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాకు రెండో స్థానం రాగా.. నరసన్నపేటకు చెందిన ఐదుగురు విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. లలిత్ ఆదిత్య మొదటి స్థానం, కింజరాపు యుగంధర్, పట్ట హేమసుందర్, ఆనం మనోజ్, డి.సంతోష్ నాయక్, చల్ల రామ్ రేవంత్‌లు రెండో స్థానం పొందారు. కర్రసాము పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు మాస్టర్ ఆవాల చిన్న యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దాడ గోవిందరావు అభినందించారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి: మండలంలోని గొడ్డ గ్రామం నుంచి అంపురం గ్రామానికి రహదారి నిర్మించాలని స్థానిక తహసీల్దార్ కార్యాయం వద్ద ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అధ్వర్యంలో సోమవారం ఆయా గ్రామాల గిరిజనులు నిరసన చేపట్టారు. తహసీల్దార్ హనుమంతరావుకు వినతి పత్రం అందించారు. గతంలో ఈ రెండు గ్రామాల రహదారి మధ్య కల్వర్టు నిర్మించారని, దానిపై స్లాబ్ వేయలేదన్నారు. కొన్నాళ్లుగా ఆ పక్కనే ఉన్న పొలంలో నుంచి ఆంపురం గ్రామానికి వెళ్లే వాళ్లమన్నారు. గ్రామానికి వెళ్లే దారిలో గొడ్డ గ్రామానికి చెందిన ఓ రైతు ఆయనకు చెందిన పొలంలో వరి పంట వేసుకోవడంతో రింపి, ఆంపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రహదారికి మధ్యలో సాగుచేస్తున్న రైతు భూ వివరాలు, అలాగే స్థలాన్ని పరిశీలన చేసి తగిన న్యాయం చేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో శ్రీకాకుళం జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు గురాడి అప్పన్న, ఇల్లాయిపురం సర్పంచ్ గవిరేసు, పలువురు గిరిజనులు ఉన్నారు.

అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఆమదాలవలస: గ్రామాలు, పట్టణాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండపాలకు అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టిందన్నారు. పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినాయక మండపాల అనుమతికి 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే.. నిరభ్యంతర పత్రం కోసం వాట్సాప్ ప్రక్రియకు వివరాలు వస్తాయన్నారు. ఆ వెబ్‌సైట్‌లో వినాయక మండపం ఏర్పాటు చేసే కమిటీ సభ్యుల వివరాలు, ప్రదేశం, విగ్రహం, మండపం ఎత్తు, నిమజ్జనం ఏ సమయంలో చేస్తారు తదితర వివరాలు అందులో నమోదు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తు ఎస్‌హెచ్ఓకు వెళ్తుందన్నారు. ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో మున్సిపల్, అగ్నిమాపక విద్యుత్ శాఖ సిబ్బంది బృందంగా ఏర్పడి వినాయక మండపం ఏర్పాటు చేసే స్థలాన్ని సందర్శిసుందన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉంటే మీ-సేవలో చలానా కట్టిన తరువాత అనుమతులు మంజూరవుతాయన్నారు. వినాయక చవితి మండపాల వద్ద డీజేలు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకల నిర్వహణకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఎస్ఐ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

నదీ తీర ప్రాంతాల పరిశీలన

బూర్జ: మండలంలోని అల్లెన, జే.బీ.పురం గ్రామాల పరిధిలో నాగావళి నది ఒడ్డు, గట్టు ప్రాంతాలను వంశధార అధికారులు సోమవారం పరిశీలించారు. కరకట్టలు నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతాలు, ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. వర్షాలు పడుతున్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈఈ హెచ్.మన్మథరావు, డీఈఈ ఎ.రమేష్, ఏఈఈలు కార్తీక్, యశ్వంత్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి



రీసర్వే డీటీకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పొందూరు: ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాలు కాపాడాలంటే పాత పింఛన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాల్సిందేనని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మొగదాల రమణరావు అన్నారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు రెండోరోజు రీసర్వే ఉప తహసీల్దార్ వైకుంఠరావుకు వినతిపత్రం అందించారు. ఓపీఎస్‌ను అమలు చేసేంతవరకు ఏపీటీఎఫ్ పోరాటం చేస్తోందన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు కె.విజయకుమార్, జవహర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని పాటించాలి

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని వర్తకులు ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని పాటించాలని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని చికెన్, మటన్, చేపల వర్తకులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం 120 మైక్రాన్‌ల కంటే ఎక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లను వినియోగించాలన్నారు. క్లాత్, జ్యూట్ సంచులను వాడాలని సూచించారు. చికెన్, మటన్ వ్యాపారులు షాపుల వద్ద మెస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. షాపుల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ బి.సృజన, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమంతు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి: మండలంలోని గొడ్డ గ్రామం నుంచి ఆంపురం గ్రామానికి రహదారి నిర్మించాలని స్థానిక తహసీల్దార్ కార్యాయం వద్ద ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అధ్వర్యంలో సోమవారం ఆయా గ్రామాల గిరిజనులు నిరసన చేపట్టారు. తహసీల్దార్ హనుమంతరావుకు వినతిపత్రం అందించారు. గతంలో ఈ రెండు గ్రామాల రహదారి మధ్య కల్వర్టు నిర్మించారని, దానిపై స్లాబ్ వేయలేదన్నారు. కొన్నాళ్లుగా ఆ పక్కనే ఉన్న పొలంలో నుంచి ఆంపురం గ్రామానికి వెళ్లే వాళ్లమన్నారు. గ్రామానికి వెళ్లే దారిలో గొడ్డ గ్రామానికి చెందిన ఓ రైతు ఆయనకు చెందిన పొలంలో వరి పంట వేసుకోవడంతో రింపి, ఆంపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రహదారికి మధ్యలో సాగుచేస్తున్న రైతు భూ వివరాలు, అలాగే స్థలాన్ని పరిశీలన చేసి తగిన న్యాయం చేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో శ్రీకాకుళం జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు గురాడి అప్పన్న, ఇల్లాయిపురం సర్పంచ్ గవిరేసు, పలువురు గిరిజనులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు



ఖాఖండ్యాం ఇసుక ర్యాంప్ వద్ద లారీలోకి ఇసుకను లోడ్ చేస్తున్న పొక్లెయినర్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సనపల సురేష్

సాక్షి టాస్క్ ఫోర్సు: బూర్జ మండలంలోని ఖాఖండ్యాం ఇసుక రీచ్, స్టాక్ పాయింట్ నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని ఆ గ్రామానికి చెందిన సనపల సురేష్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొల్లివల నుంచి ఇసుక రీచ్, స్టాక్‌పాయింట్ల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. ఇసుకను సమయపాలన లేకుండా తవ్వుతున్నారని, దీనిపై అధికారులు స్పందించడం లేదన్నారు. అనుమతులు లేకుండా వంతెన పరిసరాల్లో ఇసుక తవ్వడం వల్ల ఆ చుట్టూ ఉన్న పంట పొలాలు మునిగిపోతున్నాయన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ నుంచి లోడింగ్ జరగడం లేదని, రీచ్ లోపలకు వాహనాలు వస్తున్నాయని వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని, అధికారులు పర్యవేక్షించడం లేదన్నారు. ఇసుక అక్రమ రవాణా, నిబంధనలు పాటించకపోవడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు అధికారుల సమక్షంలోనే తనపై నిర్వాహకులు దాడికి పాల్పడ్డారని సురేష్ కుమార్ తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తం



సారవకోట: తొగిరిలో ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్



నరసన్నపేట: గోపాల పెంటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు విజయ్‌కుమార్

సారవకోట: జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని తొగిరి గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వేను సోమవారం పరిశీలించారు. ఎక్కడిక్కడ మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. చీడిపూడి, బుడితి గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకం పనితీరు, బుడితి సీహెచ్‌సీలో జ్వరాల తీవ్రతతోపాటు ప్రజలకు అందుతున్న వైద్య సేవలను గూర్చి సూపరింటెండెంట్ సుజనీకుమారిని అడిగి తెలుసుకున్నారు. సారవకోటలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈఓపీఆర్డీ రేణుక, ఏపీఎం గోవిందరాజులు పాల్గొన్నారు.

గోపాలపెంటలో వైద్య శిబిరం

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటలో వైరల్ జ్వరాలు నమోదు అవుతుండటంతో గ్రామంలో మాకివలస పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కె.విజయ్‌కుమార్ 90 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సూపర్ వైజర్ రమణ పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

పాతపట్నం: విషజ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు ఆరోగ్య కార్యకర్త టి.లక్ష్మణరావు తెలిపారు. కరసవాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్త ఎం.అన్నపూర్ణ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

తొగరాం పీహెచ్‌సీ పరిధిలో..

ఆమదాలవలస: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తొగరాం పీహెచ్‌సీ వైద్యురాలు మెట్ట స్రవంతి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని కొర్లకోట, కొత్తవలస తదితర గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టారు. వైద్య, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ మల్లిబాబు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సారవకోట: స్వామివారి పల్లకిని మోస్తున్న ధర్మాన కృష్ణదాస్, కమిటీ సభ్యులు

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారంతో ముగిశాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహానికి గ్రామంలో కోలాటంతో శోభయాత్ర నిర్వహించారు. ఉత్సవ కమిటీ వారు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ముగింపు ఉత్సవాల్లో నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొని స్వామి వారి పల్లకిని మోశారు.

నరసన్నపేట: త్రైతసిద్ధాంతం-ప్రభోద సేవా సమితి-జ్ఞానవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారంతో ముగిశాయి. శ్రీకృష్ణుడి ప్రతిమతో ర్యాలీ చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సేవా సమితికి చెందిన కార్యకర్తల పాల్గొన్నారు.